రాజ్యాంగ ప్రదాతకు జేజేలు

- వరంగల్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి
- కాశిబుగ్గలో నివాళులర్పించిన మంత్రి కొండా సురేఖ

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు వరంగల్ జిల్లాలో ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, అధికారులు, వివిధ వర్గాలు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. వరంగల్ లోని కాశిబుగ్గ సెంటర్‌లో వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- గిర్మాజీపేట

6



కాశిబుగ్గ సెంటర్‌లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

పుణ్యక్షేత్రానికి వెళ్లొస్తూ..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృత్యువాత

- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- హైవేపై లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారు
- హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ వాసులు
- కాళేశ్వరం దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్ వద్ద ఘటన

7



కారులో ఇరుక్కున్న శ్రీను మృతదేహం



రమణకుమారి మృతదేహం



అనూష మృతదేహం

వేధింపులతో వృద్ధుడి బలవన్మరణం

ఆస్తి కోసం కొడుకు, కోడలు ఒత్తిడితో ఆత్మహత్య

- వర్ధన్నపేట మండలంలోని కదారిగూడెంలో ఘటన
- కేసు నమోదు చేసిన వర్ధన్నపేట పోలీసులు

6

ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా..

అంగన్వాడీ కేంద్రాల్లో 'పోషణ పక్షం'

- హనుమకొండ జిల్లాలో ఈనెల 8న ప్రారంభం
- 'విద్య, ఆరోగ్యం' లక్ష్యంగా కార్యక్రమాలు
- వేయి దినాల ప్రాముఖ్యతపై అవగాహన
- గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు ఉపయుక్తం
- 15 రోజుల పాటు నిర్వహణ.. ఏప్రిల్ 22న ముగింపు..



ఇటీవలే పెగడపల్లిలో జరిగిన పోషణ పక్షం కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి, సిబ్బందితో పాటు అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు





హనుమకొండ సిటీ, ఏప్రిల్ 14: గర్భిణులు, బాలింతలు, 0-6 ఏళ్ల చిన్నారుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా చేపట్టిన 'పోషణ పక్షం-2025' కార్యక్రమం హనుమకొండ జిల్లాలో కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'పోషణ్ పక్షం' జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ నెల 8న ఆరంభమైంది. 15రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ఏప్రిల్ 22న ముగుస్తుంది. మహిళా, శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో ఇతర ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో 'పోషణ పక్షం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

లక్ష్యాలు

మహిళా, శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమం, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల భాగస్వామ్యంతో కార్యక్రమం కొనసాగుతోంది. పోషణ్ భీ-పడాయి భీ (పౌష్టికాహారం-విద్య) సూత్రంతో పోషణ పక్షం-2025 చేపట్టారు. జిల్లాలోని 778 అంగన్వాడీ కేంద్రాల్లో 15 రోజుల పాటు నిర్వహిస్తారు. అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన బాలింతలు, గర్భిణులు, ప్రీస్కూల్ పిల్లలకు బలమైన పౌష్టికాహారం తీసుకోవాల్సిన విధానాలను దృశ్యరూపకంగా, మౌఖిక వివరణ వివిధ మార్గాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ర్యాలీల నిర్వహణ, గ్రామీణ, మండల, నియోజకవర్గకేంద్రాల్లో పాటు జిల్లా కేంద్రంగా వివిధ రూపాల్లో అవగాహన సభలు, సమావేశాల నిర్వహణ ప్రణాళికగా పోషణ్ పక్షం కొనసాగుతోంది. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు, చికిత్సలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, చిన్నారులకు బలవర్ధక ఆహారం అందించడం, అంగన్వాడీ కేంద్రాల్లో అందచేస్తున్న తీరు తదితర అంశాలను వివరిస్తున్నారు.

వేయి దినాల ప్రణాళిక విశిష్ఠత

తల్లితో పాటు శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేందుకు 'వేయి దినాల' ప్రణాళిక ప్రాముఖ్యత విశిష్ఠతను అంగన్వాడీ కేంద్రాల్లో తెలియచేస్తున్నారు. గర్భాధారణ నుంచి ప్రసవం దాక గర్భిణీకి తొమ్మిది నెలల సమయం పడుతుంది. ఈ కాలాన్ని 270 రోజులుగా లెక్క కడతారు. ఈ సమయంలో గర్భిణీ తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టికాహారం అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో వివరిస్తూ ఆ మేరకు వారికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఇక ప్రసవం తరువాత తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్య పరిరక్షణ చర్యలను పోషణ పక్షం కార్యక్రమంలో వివరిస్తున్నారు. శిశువు జననం నుంచి ముర్రుపాలు పట్టించడం, ఆపై రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాల శ్రేష్ఠత, ఆరోగ్యం అంశాలను తల్లితో పాటు భర్త ఇతర కుటుంబ సభ్యులకు సైతం అవగాహన కల్పించే చర్యలను చేపడుతున్నారు. శిశువు రెండేళ్ల వయస్సుకాలాన్ని మొత్తం 730 రోజులుగా లెక్క కడుతున్నారు. ఈ క్రమంలో గర్భిణీ నుంచి ప్రసవం వరకు తల్లి ఆరోగ్యం కోసం 270 రోజులు, శిశువు రెండేళ్ల వయస్సు లెక్కన 730 రోజులు ఈ రెండింటినీ కలిపితే వేయి రోజుల ప్రణాళికతో తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణ కాలంగా పరిగణించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. వేయి దినాల ప్రత్యేకతను అంగన్వాడీ కేంద్రాల్లోనే కాక ఆయా గ్రామాలు, మండలాల ప్రధాన కేంద్రాల్లో దృశ్య శ్రవణ మార్గాలు, పోస్టర్లు, కరపత్రాలు, ఇంటింటి సందర్శన తదితర మార్గాల ద్వారా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఇతర శాఖల అధికారులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు అవగాహన కల్పిస్తున్నారు.

విద్యకు ప్రాముఖ్యత

'పోషణ్ భీ - పడాయి భీ' (ఆరోగ్యంతో పాటు విద్య కూడా...) సూత్రంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ దశలో శిశువులకు విద్యపై ఆసక్తి కల్పించే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యత వివరింపు తద్వారా పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించడం వంటి చర్యలపై దృష్టి పెట్టారు. ఈ మేరకు పక్షత్సవాల్లో అవగాహన కల్పన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యపై ఆసక్తి కల్పించేందుకు వినూత్న పద్ధతుల్లో చేపడుతున్న బోధన మార్గాలను తెలియచేస్తున్నారు. ఆట వస్తువులు, బొమ్మలు ఇతరత్రా మార్గాల ద్వారా వారికి విద్యపై ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. చిరు ప్రాయంలోనే పిల్లలకు విద్యపై ఆసక్తి కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైనా పునాదులు వేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

23తో ముగింపు

ఈ నెల 8న పోషణ పక్షం - 2025 కార్యక్రమాన్ని ఆరంభించారు. 22న ముగుస్తుంది. హనుమకొండ జిల్లా కేంద్రంగా త్వరలో భారీ కార్యక్రమ నిర్వహణకు మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలు చేపడుతోంది. ఇటీవలే అంగన్వాడీ కేంద్రాల్లోని 0-6 ఏళ్ల చిన్నారులకు నేత్ర పరీక్షలను ప్రభుత్వం చేపట్టింది. రెండు నెలల పాటు జిల్లాలోని 778 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రణాళిక మేరకు ఆయా రోజుల్లో పరీక్షలను నిర్వహించి దృష్టి లోపాలను గుర్తిస్తున్నారు. ఒకవైపు నేత్ర పరీక్షలు మరో వైపు పోషణ పక్షం కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఇతర సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు తదితరులు తలమునకలయ్యారు.



ఎంఆర్‌వోలో ప్రతీ పనికో రేటు

సర్టిఫికెట్ల జారీలో ఓ జూనియర్ అసిస్టెంట్ చేతివాటం

6

నిరుద్యోగులకు 'రాజీవ్' మంచి అవకాశం

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



కాశిబుగ్గ సర్కిల్ ఆఫీసులో దరఖాస్తులు పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు రాజీవ్ యువ వికాసం పథకం మంచి అవకాశం అని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారంతో ముగుస్తుండడంతో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. సెలవు రోజు అయినా హెల్ప్‌డెస్క్‌లలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 12, 13, 14 తేదీలలో ప్రభుత్వ సెలవులు ఉన్నా కూడా ప్రజల సౌకర్యార్థం బల్దియా, కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాలలో దరఖాస్తులు స్వీరించామన్నారు. సోమవారం సాయంత్రం వరకు 10,254 దరఖాస్తులు స్వీరించినట్టు కమిషనర్ వెల్లడించారు. కమిషనర్ వెంట బల్దియా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కృషి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కేయూ నుంచి పెట్రోల్ పంపు వరకు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం, కావ్య తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో 'భాగంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా సోమవారం 52, 53, 44 డివిజన్‌లలో తలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కేయూ క్రాస్ నుంచి పెట్రోల్ పంపు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు రాజ్యాంగం పట్ల ఏ విధంగా వ్యవరిస్తున్నాయో ప్రజలకు ఈ యాత్ర ద్వారా తెలియజేస్తున్నామన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అమిత్ షా అవమానపరిచాడన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ.. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలనను సాగిస్తోందన్నారు. పేద ప్రజలకంటే బడాబాబులే ముఖ్యమన్నట్లుగా ప్రధాని మోదీ దేశాన్ని పాలిస్తున్నారని ఆరోపించారు. అనంతరం డివిజన్‌లలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ తీశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీ కడియం కావ్య, ఎంఎల్‌సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రు పాషా, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఏపీసీసీ నాయకుడు బెలయ్యనాయక్, 54 డివిజన్ కార్పొరేటర్ గుంటి రజితా శ్రీనివాస్, నాయకులు బంక సంపత్, నాయి ని లక్ష్మారెడ్డి, మట్టెడ అనిల్, రహీమున్నీసా బేగం ఎర్ర మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రదాతకు జేజేలు


హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాదాలు చేస్తున్న వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు


పూలమాలలతో మునిగిన హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం

- ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు
- బాబా సాహెబ్ ప్రపంచ మేధావి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వడ్డెపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దేశాలు గర్వించే మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం అందించి అన్ని వర్గాల వారికి హక్కులు కల్పించిన గొప్ప మహానుభావుడు అంబేద్కర్ అని, ఆయన ఆశయాలను సమాజంలోని ప్రతీ ఒక్కరు కొనసాగించాలని కోరారు. అంబేద్కర్ 134వ జయంతి ని పురస్కరించుకొని సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆమెతో పాటు మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాష, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద కుమార్ మాదిగతో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఆధారంగానే తమకు ఎంపీ, ఎమ్మెల్యేలుగా అవకాశాలు లభించాయని అన్నారు. రాజ్యాంగం ద్వారా దేశంలోని పౌరులందరికీ ఓటు హక్కు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలో హక్కులు, బాధ్యతలతో పాటు సామాజిక, ఆర్థిక, సమసమాజం నిర్మించాలని ఆకాంక్షించారు. రాజ్యాంగం గొప్ప తనాన్ని, డాక్టర్ బీఆర్. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని గ్రామాల్లోని చివరి ఇంటి వరకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సమాజానికి గొప్ప సందేశాన్ని ఇచ్చిన దిక్సూచి లాంటి మహనీయుడని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మార్తినేని ధర్మారావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మల శోభారాణితోపాటు బీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ఖన్నా, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లంపెల్లి షడ్రక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు మేరుగు శివ, మండల సమ్మయ్య తదితరులు సైతం వేర్వేరుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


వరంగల్ కాశిబుగ్గ సెంటర్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



అంబేద్కర్ ఆశయాల మేరకే పాలన

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- కాశిబుగ్గలో ఘనంగా బాబా సాహెబ్ జయంతి

గిర్మాజిపేట, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, బహుజనుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వరంగల్ కాశిబుగ్గ జంక్షన్‌లో సోమవారం అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి మంత్రి కొండా సురేఖ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అంబేద్కర్.. భారత రాజ్యాంగాన్ని రూపొందించారని గుర్తు చేశారు. ఆయన అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే సర్వోన్నత రాజ్యాంగంగా ప్రసిద్ధి చెందిందని కొనియాడారు. అంబేద్కర్ జయంతి రోజున సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ జీవోను జారీ చేశారని, ఇది అంబేద్కర్ ఆశయాల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని, ఇదే అంబేద్కర్‌కు అసలైన నివాళి అని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపై ఉందని అన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ 'జైభీమ్.. జై సంవిధాన్.. జై భారత్' కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. అంబేద్కర్ కలలు కన్న సమాజాన్ని తయారు చేసేందుకు పునరంకితం అవుదామని అన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. అంబేద్కర్ సూచించిన మార్గం ఎల్లప్పుడూ మనకు ఆదర్శనీయమని అన్నారు. కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికి వివిధ చట్టాలు, సంస్కరణలను రూపొందించిన అంబేద్కర్ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాష్, కార్పొరేటర్లు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, దళిత సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆకేరు ఇలా.. రాకపోకలు ఎలా..?

- పూర్తి స్థాయిలో వాడుకలోకి రాని వాగు బ్రిడ్జి
- దారి లేక పొలాలకు పోయేందుకు ఇబ్బందులు
- పూర్తి చేయాలని అధికారులకు రైతుల విజ్ఞప్తి


ల్యాబర్తిలో ఆకేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జి, గత వర్షాకాలంలో పరిస్థితి (ఫైల్)


పొలాల నుంచి రహదారి లేకపోవడంతో నిరుపయోగంగా కనిపిస్తున్న బ్రిడ్జి

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ల్యాబర్తి గ్రామ ఆకేరు వాగుపై రూ. కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని నిరుపయోగంగా వదిలేశారు. బ్రిడ్జికి పూర్తిస్థాయిలో దారిని నిర్మించకపోవడంతో వేసవి కాలంలో తప్ప, వర్షాకాలంలో ఆ బ్రిడ్జిపై నుంచి పోయే విధంగా లేదు. ఇరు వైపులా ఇంకా భూసేకరణ చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైంది. నామమాత్రంగా మట్టిని పోసి చేతులు దులుపుకోవడంతో, గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఆ మట్టి కూడా కొట్టుకుపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. గ్రామం నుంచి తమ వ్యవసాయ పొలాలకు వెళ్లాల్సిన రైతులు ఇంకా నీటిలో నుంచి వెళ్లడంతో, బ్రిడ్జి నిర్మించి ఎవరికి లాభమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా బ్రిడ్జి

మండలంలోని ల్యాబర్తి గ్రామంలో ఉన్న ఆకేరు వాగుపై ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో దాదాపు రూ.14 కోట్లతో సుమారు ఐదేళ్ల కిందట బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. గతేడాది చివరిలో ఈ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. కానీ, బ్రిడ్జికి ఇరుపక్కల ఉన్న వ్యవసాయ భూములను సేకరించి రహదారిని పూర్తిస్థాయిలో నిర్మాణం చేయలేదు. గ్రామానికి కలుపుతూ రహదారిని నిర్మించి బ్రిడ్జి వరకు పనులు చేయాల్సిన కాంట్రాక్టర్ మధ్యలో వదిలేశారు. భూముల సేకరణలో కూడా పెద్దగా ఇబ్బందులు లేవని స్థానికులు చెపుతున్నారు. రెండు వైపులా అసైన్డ్ భూములే ఉన్నాయని, వాటిని సేకరించేందుకు ఇబ్బందులు తలెత్తవని అభిప్రాయపడుతున్నారు. కొంత పట్టాభూములు ఉన్నా.. ప్రభుత్వం తలుచుకుంటే రైతులకు నష్టపరిహారం చెల్లించి బ్రిడ్జి రాకపోకల మార్గాన్ని సుగమమం చేయవచ్చని చెపుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

ల్యాబర్తి గ్రామ రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లాలంటే ఆకేరు వాగు దాటి వెళ్లాలి. వాగు ఉధృతంగా ప్రవహించినప్పుడు వారు పొలాలకు వెళ్లేందుకు సాహసించరు. నీటి ఉధృతి తగ్గిన తర్వాత నడుచుకుంటూ వెళ్తారు. కొంత నీటి లోతు తక్కువైతే ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై నెమ్మదిగా రాకపోకలకు సాగించేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం చేసింది. కానీ, రహదారి సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో ఆకేరు వాగు ఉప్పొంగితే తిరిగి మళ్లీ అదే నీటిలో నడిచి వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. దీంతో వర్షాకాలంలో కూలీలు వెళ్లేందుకు, ఎరువుల బస్తాలు ఎక్కువ మోతాదులో తీసుకెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. గీత కార్మికులు సైతం తాటిచెట్లను ఎక్కి జీవనం సాగించేందుకు వాగును దాటాల్సిందే. కల్లుతో వాగును దాటడం ఇబ్బందిగా ఉందని చెపుతున్నారు. కోట్ల రూపాయలతో నిర్మించి బ్రిడ్జిని వాడుకలోకి తెస్తే ఇబ్బందులు పోతాయని చెపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టి సారించి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని రైతులు కోరుతున్నారు.


మర్రి యాదవరెడ్డి తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మర్రి యాదవరెడ్డికి ఎర్రబెల్లి పరామర్శ

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందగా సోమవారం వారి స్వగ్రామం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌లు కలిసి వెంకటమ్మ చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్నేని రవీందర్‌రావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గాంధీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య


సంజీవరావు (ఫైల్)

కాజీపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై ఓ రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డెపల్లి పరిమళకాలనీకి చెందిన పురం సంజీవరావు (76) కొంతకాలంగా నిత్యం మద్యం సేవిస్తూ ఇంట్లో గొడవపడుతూ ఆత్మహత్య చేసుకుంటానని భార్యను బెదిరిస్తున్నారు. ఆదివారం రాత్రి వడ్డెపల్లి చెరువు సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించామని, మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వేధింపులతో వృద్ధుడి బలవన్మరణం

- ఆస్తి కోసం కొడుకు, కోడలు ఒత్తిడితో ఆత్మహత్య
- వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెంలో ఘటన



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెంలో మల్లేశం మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) నాంపెల్లి మల్లేశం (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రి బలవన్మరణానికి ఓ కుటుంబం కారణమైంది. ఆస్తి కోసం వృద్ధుడిని వేధిస్తూ, నిందిస్తూ చివరకు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకునేలా చేసింది. ఈ ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెం గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కడారిగూడెం గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేశం(93) - రాధమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు సదానందం, చంద్రమొగిలి, కోటేశ్వర్, ఒక కుమార్తె అమరావతి విజయ ఉన్నారు. అందరికీ వివాహాలు చేసి ఆస్తులను సమ భాగంగా పంచాడు. ఏడెకరాల వ్యవసాయ భూమి ఉండగా, కుమారుల కు రెండెకరాల చొప్పున ఇచ్చి ఎకరం మల్లేశం తనపైనే ఉంచుకున్నాడు. 2021లో భార్య రాధమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో తండ్రిని సాకేందుకు కుమారులు నెలకొకరు వంతుల వారీగా తిండి పెట్టే విధంగా మాట్లాడుకున్నారు.

ఈ తరుణంలో చిన్న కుమారుడు కోటేశ్వర్, అతడి భార్య ఎలేంద్ర వృద్ధుడి పేరుపై ఉన్న వ్యవసాయ భూమి, కొంత నగదు ఇవ్వాలని వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో కొన్ని రోజుల కిందట వృద్ధుడు మల్లేశం పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కొడుకు, కోడలిని స్టేషన్‌కు పిలవగా పెద్ద మనుషుల సమక్షంలో గ్రామంలో మాట్లాడుకుంటామని చెప్పి వెళ్లిపోయారు. తర్వాత మళ్లీ కోడలు వృద్ధుడిని తిట్టడం ప్రారంభించింది. దీంతో మళ్లీ పోలీస్ స్టేషన్ చేరుకుని పోలీసులకు జరిగిన విషయాన్ని చెప్పుకున్నాడు. కానీ, పోలీసులు పట్టించుకోలేదు. దీంతో మనోవేదనకు గురైన వృద్ధుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

కొడుకు, కోడలిపై కేసు

నాంపెల్లి మల్లేశం ఆత్మహత్య కేసులో ఆయన చిన్న కొడుకు కోటేశ్వర్, కోడలు ఎలేంద్రపై కేసు నమోదు చేసినట్లు సోమవారం సాయంత్రం వర్ధన్నపేట ఎస్ఐ చందర్ ప్రకటన విడుదల చేశారు. మల్లేశంను కోటేశ్వర్, ఎలేంద్రలు కొద్దిరోజుల నుంచి ఆస్తికోసం నిత్యం వేధిస్తూ ఉండేవారన్నారు. ఈ క్రమంలో ఈ నెల 13న ఉదయం 10గంటలకు మల్లేశం గడ్డి మందు తాగగా, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 8.20 గంటలకు మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమార్తె అమరావతి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ సెక్షన్ 108 కింది కోటేశ్వర్, ఎలేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

వృద్ధుడి వాంగ్మూలం

ఈనెల 13న ఇంట్లో ఉన్న పురుగుల మందును వృద్ధుడు సేవించి నాంపెల్లి మల్లేశం ఆత్మహత్యాయత్నం చేసుకోగా గమనించిన రెండో కుమారుడు చంద్రమొగిలి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించాడు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. మెజిస్ట్రేట్ ఆస్పత్రికి చేరుకోగా ఆయన ఎదుట వృద్ధుడు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మేజిస్ట్రేట్, పోలీసులు వీడియోలు సైతం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై వృద్ధుడి కుమార్తె విజయను సైతం ప్రశ్నించగా పోలీసులు పట్టించుకోకపోవడం వలనే తన తండ్రి మృతిచెందాడని ఆరోపించింది.

ఎంఆర్‌డీలో ప్రతీ పనికో రేటు

- సర్టిఫికెట్ల జారీలో ఓ జూనియర్ అసిస్టెంట్ చేతివాటం
- ఎంజీఎం అధికారులు దృష్టి పెట్టాలని రోగుల వినతి



ఎంజీఎం మెడికల్ రికార్డ్ డిపార్ట్‌మెంట్

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి మెడికల్ రికార్డ్ డిపార్ట్‌మెంట్‌లో ఓ జూనియర్ అసిస్టెంట్ ప్రతీ పనికో రేటు చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సదరు జూనియర్ అసిస్టెంట్‌కు యూఎంఆర్‌డీలో శిక్షణలో లేకున్నప్పటికీ ఈ విభాగంలో విధులు కేటాయించడంపై అనుమానాలువ్యక్తం అవుతున్నాయి. పెద్ద మొత్తంలో ముడుపులు సమర్పించి ఈ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ ప్రతీ పనికి ఓ రేటుకు చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మెడికల్ లీవ్‌లు, పోలీసు సర్టిఫికెట్లు, సిక్ లీవ్‌లు, వికలాంగుల ట్రైన్ పాస్‌లు, కేస్‌షీట్‌లలో పేర్ల మార్పిడీలాంటి వాటికి ప్రతీపనికి ఓ రేటు చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల పోలీసు శాఖకు చెందిన అధికారిని కూడా ఇదే తరహా మామూలు డిమాండ్ చేయడంతో ఏసీపీ స్థాయి అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎవరైనా ప్రశ్నిస్తే ఎంజీఎం ఏడీ తనకు దగ్గరి మిత్రుడని బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇదే విభాగం నుంచి ఓ ఉద్యోగి ఏసీబీకి పట్టుపడ్డ విషయం తెలిసిందే. ఎల్ఐసీ సర్టిఫికెట్ల విషయంలో కూడా ఇదే తరహాలో డబ్బులు గుంజుతున్నట్లు తెలుస్తోంది. సదరు జూనియర్ అసిస్టెంట్ తీరు ఎంఆర్‌డీకి శాపంగా మారింది. లక్షలు ఖర్చుపెట్టి యూఎంఆర్‌డీ విభాగంలో శిక్షణ ఇచ్చిన ఉద్యోగులను పక్కనపెట్టి ఎలాంటి శిక్షణ లేని జూనియర్ అసిస్టెంట్‌కు ఈ విభాగంలో బాధ్యతలు అప్పగించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఎంఆర్‌డీ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ ఆదాతోనే గృహజ్యోతి

200 యూనిట్లు మించి వాడితే మొత్తం చెల్లించాల్సిందే..



వర్ధన్నపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన అనూహ్య మార్పులతో వేసవికి ముందే ప్రజలు వేడికి తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి తాపం నుంచి రక్షించుకోవడానికి పట్టణ, మండల, గ్రామస్థాయిలో ఏసీలు, కూలర్లు వాడుతుండడంతో మార్చి మొదటివారంలోనే విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. విచ్చలవిడిగా వాడితే గృహజ్యోతి పథకం వర్తించకుండా పోయే ప్రమాదం ఉంది. 200 యూనిట్లకు ఒక్క యూనిట్ అదనంగా వచ్చినా బిల్లు కట్టాల్సిందే. ఒక వైపు వేసవితాపం.. మరోవైపు విద్యుత్ బిల్లుల భారం.. ఒకటి కావాలంటే మరొకటి వదులుకోవాల్సిన పరిస్థితి. దీని నుంచి గట్టెక్కాలంటే విద్యుత్‌ను పొదుపుచేసుకోవడమే మార్గం. అలా అని ఉపకరణాలను పక్కనపడేయకుండా విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే మేలు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇంట్లో నిరంతరాయంగా గృహజ్యోతిని వెలిగించవచ్చు.

మన ఇళ్లలో ఇలా చేద్దాం..

మార్కెట్‌లో ఎన్నో కంపెనీల విద్యుత్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఏసీలు, కూలర్లు, ఫ్రిడ్జిలు, ఫ్యాన్లు, ఎల్ఈడీ బల్బులను 1-5 స్టార్లతో విక్రయిస్తారు. వీటిలో 5 స్టార్ రేటింగ్ ఉపకరణాలే విద్యుత్‌ను తక్కువగా ఖర్చు చేస్తాయి. ఐఎస్ఐ మార్కు గల ఉత్పత్తుల వాడకం అన్ని విధాలా సురక్షితమైనది. వీటి వల్ల ప్రమాదాలను నివారించవచ్చు. పాత తీగలుంటే మార్చుకోవడం శ్రేయస్కరం. టీవీని అవసరం లేనపుడు రిమోట్‌తో కాకుండా పూర్తిగా ఆఫ్ చేయాలి. సెల్‌ఫోన్ చార్జింగ్ నిండాక చార్జర్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి. బయటకు వెళ్లినా, అవసరం లేదనిపించినా ఫ్యాన్ స్విచ్ఛాఫ్ చేయాలి. కాలానుగుణంగా ఆధునిక సాంకేతికత గల ఫ్రిజ్‌ను మార్చుకుంటే నెలవారి విద్యుత్ వాడకం ఆదా అవుతుంది. అంతేకాకుండా ఏసీలను 24-28 డిగ్రీల మధ్య నడుపుకోవాలి. మార్కెట్‌లో పలు కంపెనీల సింగిల్, డ్యూయల్ ఇన్వెర్టర్ల ఏసీలు అందుబాటులో ఉన్నాయి. నిర్దేశిత ఉష్ణోగ్రతకు వాతావరణం మారగానే ఆటోమెటిక్‌గా ఆఫ్ అయ్యేవాటిని వాడాలి. పాతవాటికి సకాలంలో మరమ్మతులు చేయించాలి. అన్నిచోట్ల ఎల్ఈడీ బల్బులు వినియోగం అత్యుత్తమం.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

ఇళ్లల్లో విద్యుత్ ఆదాకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ సరఫరా అయ్యే తీగలు, ఇంట్లో గదులకు సరఫరా చేసే తీగల్లో గేజ్ అధికంగా ఉండేలా చూసుకోవాలి. ఎక్కువగా ఎల్ఈడీ బల్బులు వినియోగించాలి. నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు వాడాలి. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడాలంటే ప్రణాళికబద్ధంగా ఉపకరణాలు వినియోగించుకోవాలి. గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- తరుణ్, ఏఈ వర్ధన్నపేట

	సామర్థ్యం (వాట్స్‌లో)	వాడకం (రోజులో గంటల్లో)	నెలకు ఖర్చయ్యేది
ఫ్యాన్	60	15	27
టీవీ	100	06	18
ఎల్ఈడీ బల్బు	40	10	01
వాషింగ్ మెషిన్	300	02	18
మిక్సీ / గ్రైండర్	450	01	13
వాటర్ హీటర్	3000	01	20
బోర్ మోటర్	300	01	20
ఏసీ	1500	2-5	90-120

పుస్తకంతో నేస్తం చేద్దాం..

- పుస్తక పఠనంతో ప్రయోజనాలు అనేకం
- వేసవి సెలవులు చిన్నారులకు అనుకూలం
- సెల్‌ఫోన్ పక్కన పెడితే కావలసినంత సమయం
- విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంచేందుకు దోహదం





కరీమాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ప్రతీ ఇంట్లో పుస్తకాలు తప్పకుండా ఉండేవి. నేడు వాటి స్థానంలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు వచ్చేశాయి. సమాజం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా పుస్తకా స్థానాన్ని భర్తీ చేయలేవు. పుస్తకాలు మనకు నేస్తాల్లాంటివి. అందుకే 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. మంచి పుస్తకం కొనుక్కో' అన్నారు పెద్దలు. 'పుస్తకం హస్తభూషణం' అని వర్ణించారు కవులు. కానీ నేటి సమాజంలో పుస్తకాలు కనుమరుగవుతున్నాయి. పాఠ్య పుస్తకాలు పెరిగిపోయి.. విజ్ఞానం, కథల పుస్తకాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. గ్రంథాలయాలకు వెళ్లి చదువుకునేంత తీరిక, ఓపిక తగ్గిపోతున్న రోజులివి. ఇంటిల్లిపాదీ ఆనందంగా ఒక మంచి పుస్తకాన్ని గురించి మాట్లాడుకునే పరిస్థితి ఎప్పుడో పోయింది. కేవలం స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల కాలంలో ఉన్నాం మనం. మనసుతో మాట్లాడే నేస్తాలు పుస్తకాలే అనే విషయాన్ని విస్మరించాం. ఈ వేసవిలో అయినా పిల్లలకు మంచి నేస్తాల్లాంటి పుస్తకాలను పరిచయం చేద్దాం. పెద్దలు చెప్పిన మాటను నిజం చేద్దాం..

పుస్తకాలతో తెలివితేటలు

పిల్లలు పెరిగే క్రమంలో తమ చుట్టూ కనిపించే ప్రతీ విషయం మీద ఆసక్తి పెంచుకుంటారు. వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. తల్లితండ్రులు వివేకవంతులైతే వారి సందేహాలను నివృత్తి చేస్తూ వారికి విషయ పరిజ్ఞానాన్ని అందిస్తారు. లేదంటే వారి అనుమానాలు అలాగే ఉండిపోతాయి. అవి తీరాలంటే పుస్తక పఠనం తప్పనిసరి. పుస్తకాలు చదవడం వల్ల విషయం విజ్ఞానంతో పాటు భాషా పరిజ్ఞానం కూడా పెరుగుతుంది. ప్రతీరోజు నిద్రపోయే ముందు చిన్నారులతో కథల పుస్తకాలు చదివిస్తే భవిష్యత్తులో వారి తెలివితేటలు బాగా అభివృద్ధి చెందుతాయని ఓ అధ్యయనంలో తేలింది. పడుకునే ముందు 20 నిమిషాల పాటు కథల పుస్తకాలు చదివే పిల్లల్లో అక్షరాస్యత శాతం మెరుగుపడుతుంది. చిన్న వయసులో పిల్లలు కథలంటే ఎలాగూ ఆసక్తి చూపుతారు. అలాంటి వారికి కథల పుస్తకాలు చదివే అలవాటు చేయాలని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు.

అలవాటు చేయండిలా...

పుస్తక పఠనం పిల్లలకు ఎంత తొందరగా అలవాటు చేస్తే అంత మంచిది. బాలల సాహిత్యానికి సంబంధించిన ఆసక్తికర పుస్తకాల ను కూడా చదివించాలి. ఇలా చేయడం వల్ల పిల్లలు తమకు తెలియకుండానే పుస్తకాల పట్ల ఆకర్శితులవుతారు. వారికి ఏమైనా సందేహాలు వస్తే మనమే నివృత్తి చేయాలి. పుస్తక పఠనం ద్వారా కొత్త కొత్త పదాలు నేర్చుకుంటారు. కొత్త విషయాలు తెలుసుకుంటారు. పిల్లల వయసుకు తగ్గ పుస్తకాలనే చదివించాలి. అలా కాకుండా ఏదో ఒక పుస్తకం ఇచ్చి చదివించడం అంటే పుస్తక పఠనంపై వాళ్ళకి ఆసక్తి నశించే ప్రమాదం ఉంది.

- పిల్లలను తల్లిదండ్రులు తరుచూ లైబ్రరీకి తీసుకెళుతూ ఉండాలి. అలా చేయడం వల్ల పిల్లల్లో పుస్తకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. పిల్లలను లైబ్రరిల్లో సభ్యులుగా కూడా చేర్పిస్తే ఇంకా మంచిది. దీని వల్ల పిల్లలు కొత్త స్నేహితులను సంపాదించుకోవడమే కాకుండా పుస్తకాలంటే కూడా అమితంగా ఇష్టపడతారు.
- పిల్లల చేత బాలల సాహిత్యంలో మాస్టర్ పీస్‌లుగా చెప్పుకునే పుస్తకాలు చదివించాలి.
- పిల్లల ఆసక్తి తగ్గట్టు పుస్తకాలను చదివించడం వల్ల పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం పెరుగుతుంది.
- మంచి పుస్తకాలను పిల్లలకు బహుమతిగా ఇస్తుండాలి. ఇలా చేయడం వల్ల పిల్లలు మెల్లగా పుస్తక పఠనంపై మక్కువ చూపెడతారు. అలాగే తల్లిదండ్రులు కూడా పుస్తకాలు చదవడం వల్ల పిల్లలకు స్ఫూర్తిగా నిలబడతారు. చిన్నప్పటి నుంచి పిల్లలు పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే మంచి తెలివితేటలతో అన్నింటా ముందు వరుసలో ఉంటారు.
- బొమ్మలుండే పుస్తకాలను పిల్లలకు అందిస్తే పిల్లలు అందులోని సారాంశాన్ని తొందరగా అర్థం చేసుకుంటారు. పిల్లల చదువుపై కూడా పుస్తక పఠనం ప్రభావం ఉంటుంది. కథల పుస్తకాలు చదివిస్తుండటం వల్ల తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య ప్రేమ మరింత పెరుగుతుంది.



జేఎన్ స్టేడియంలో పావురాలకు గింజలను ఆహారంగా అందజేస్తున్న వాకర్స్

జేఎన్‌ఎస్‌కు కపోతాల కళ

- స్టేడియం వద్ద ముచ్చట గొలుపుతున్న పావురాలు
- ఆహారం అందిస్తున్న వాకర్స్

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఔట్ డోర్ స్టేడియం ప్రధాన ప్రాంగణం వద్ద కపోతాలు ప్రతీరోజు ఉదయం సందడి చేస్తున్నాయి. ఉదయం వాకింగ్‌కు వచ్చే వాకర్స్ గేటు ముందుకు వచ్చే సమయంలో కపోతాలు పెద్ద ఎత్తున గుంపులుగా గుమికూడి అలరించడంతో వాటిని చూసి సంబరపడిపోతున్నారు. అక్కడే గేటు ముందు చిరు ధాన్యాలు విక్రయాలు చేయడంతో వాటిని వాకర్స్, పక్షి ప్రేమికులు కొనుగోలు చేసి పావురాలకు అహారంగా అందించడంతో పెద్ద ఎత్తున గుంపులు గుంపులుగా చేరుకొని చిరు ధాన్యాలను స్వీకరిస్తూ, ముచ్చట గొలుపుతున్నాయి. చిరు ధాన్యాలు అందించే వ్యక్తి చేతిపై వాలి మొలకలు, గింజలను ఆరగిస్తూ కనివిందు చేస్తున్నాయి. దీంతో వాకింగ్ వచ్చే వారు కపోతాలకు చిరు ధ్యాన్యాలు అందించి వాటితో సెల్ఫీలు, ఫోటోలు దిగేందుకు ఆసక్తిని కనబర్చుతున్నారు. చిన్న పిల్లలు కపోతాలను చూసి వాటితో ఆడుకోవాలను ఆరాటంతో గింజలను చల్లుతూ వాటిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

- వరంగల్ స్పోర్ట్స్

పుణ్యక్షేత్రానికి వెళ్లొస్తూ..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృత్యువాత

- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- హైవేపై లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్ వద్ద ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్



ప్రమాదానికి కారణమైన లారీ

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు అతివేగంగా ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్ పూర్ మండలంలోని రాఘవపూర్ గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సత్తి రాజేశ్వరరావు - అనంతలక్ష్మిల కుటుంబం హైదరాబాద్‌లోని గాజుల రామారంలో కొన్నేళ్ల కిందట వచ్చి స్థిరపడింది. రాజేశ్వర్‌రావు - అనంతలక్ష్మి దంపతుల కుమారుడు శ్రీను (50), కోడలు రమణకుమారి (40), మనువడు సత్య అరవింద్, మనువరా లు అనూష (22)లు కలిసి సోమవారం ఉదయం కారులో గాజులరామారం నుంచి భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. అక్కడ పూజలు ముగించుకొని సాయంత్రం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం 5గంటల సమయంలో మండలంలోని రాఘవపూ ర్ గ్రామ శివారులో ముందువెళ్తున్న లారీని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న శ్రీను, ఆయన భార్య రమణకుమారి, కూతురు అనూషలు అక్కడికి అక్కడే మృతి చెందారు. కారులో వెనుక కూర్చున్న రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, శ్రీను కుమారుడు సత్య అరవింద్‌లు తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కొని తీవ్రంగా గాయపడిని రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, సత్య అరవింద్‌లను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారులో ఇరుక్కున్న మృతదేహాలను పోలీసులు వెలికితీయడానికి శ్రమించాల్సి వచ్చింది. డ్రైవర్‌సీటులో ఉన్న శ్రీను తలపగిలిపోయి కారులో ఇరుక్కుపోయాడు. పోలీసులు క్రేన్‌ను తీసుకువచ్చి మృతదేహాన్ని వెలికితీయడానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, సత్యఅరవింద్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో జనగామ ఏరియా ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న డీసీపీ రాజమహేంద్రనాయక్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. సీఐలు జి.వేణు. ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు వినయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, నరేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు.





తీవ్రంగా గాయపడిన రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి

ప్రమాదకరంగా మట్టి పెల్లలు





రోడ్డుపై ప్రమాదకరంగా మారిన మట్టి పెల్లలు

హనుమకొండ భద్రకాళి చెరువునుంచి మట్టి తరలిస్తుండటంతో హంటర్ రోడ్‌లోని డి కన్వెన్షన్ హాల్ సమీపంలో రోడ్డుపై మట్టిదిబ్బలు ప్రమాదకరంగా మారాయి. లారీల ద్వారా తరలిస్తున్న మట్టి.. రోడ్డుపై పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీనిని రోడ్డు పైనుంచి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫోటోలు: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ / హనుమకొండ

మండే ఎండలో ఉపశమనం ఎలా..?

- వేసవిలో ఉపాధి హామీ కూలీల కష్టాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



ఎండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

వర్ధన్నపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇలాంటి తరుణంలో మట్టి పనులు చేయడం ఉపాధి హామీ కూలీలకు కష్టసాధ్యంగా మారింది. పైగా పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం ఉండడం లేదు. ఎవరికి వారే తాగునీటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అత్యవసర ఔషధాల కిట్లు అందుబాటులో ఉండడం లేదు.

గతంలో ఇలా..

ఉపాధిహామీ పథకంలో గతంలో ఫిబ్రవరి నుంచి మే వరకు కూలీలు చేసిన పనికి 30 శాతం అదనపు భత్యం చెల్లించేవారు. ప్రయాణ, కరువు భత్యం ఖర్చు కింద గడ్డపారకు రూ.10లు, తట్టకు రూ.5లు, ఐదు కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే వారికి రూ.20లు చొప్పున ఇవ్వాలి. వీటితోపాటు పని ప్రదేశంలో నీడ కల్పించి విశ్రాంతి తీసుకునేలా చూడాలి. రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం వీటిని నిలిపివేయడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎదురయ్యే సమస్యలు ఇవే...

ఎండలో ఎక్కువ సేపు పనిచేయడం వల్ల కూలీలకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. పని ప్రదేశాల్లో తాగు నీరు సరిపడా లేకపోవడం వల్ల నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. మధ్యాహ్నం పూట ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. నీడ సౌకర్యం లేకపోవడంతో కూలీలు శారీరకంగా బలహీనమవుతారు. ఎండల వల్ల చర్మ సమస్యలు, అలసట, తలనొప్పివంటివి ఎదురవుతాయి.

స్వీయ జాగ్రత్తలే కీలకం

ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు తగినంత నీరు తాగాలి. శరీరం డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ద్రావణం లేదా నిమ్మకాయ నీళ్ల ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉన్నపుడు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3గంటల వరకు పనిచేయడం మంచిది. పని మధ్యలో చిన్నచిన్న విరామాలు తీసుకోవాలి. శరీరం అలసిపోయినట్లు అనిపిస్తే విశ్రాంతి తీసుకోవాలి. తలనొప్పి, మైకం, వాంతులు, చెమట ఆగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుల సహాయం తీసుకోవాలి. బాధిత వ్యక్తిని నీడప్రదేశంలోకి చేర్చి శరీరాన్ని తుడవాలి. ఉప్పు, చెక్కెర కలిపిన ఆహారం లేదా పండ్లు తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి, లవణాలు నిల్వ ఉంటాయి. పని ప్రదేశానికి సమీపంలోని వైద్య కేంద్రం వివరాలు తెలుసుకోవాలి.

నన్ను జర బాగు చేయరూ..

- ఎందరికో సమాచారం అందించా..
- ఓ పోస్టు బాక్స్ మనోవేదన

నేనొక పోస్ట్ బాక్స్‌ను. హనుమకొండ బాలసముద్రంలో సుమారు 30 ఏళ్ల కిందట నన్ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ మీకు సేవ చేశాను. ఎన్నో ఉత్తరాలను నాలో భద్రపరిచాను. నా వాళ్ల (సిబ్బంది) చేత మీ వాళ్లకు వేల సంఖ్యలో ఉత్తరాలు అందించాను. అందరి యోగ క్షేమాలు పరస్పరం తెలియపరిచాను. ఎన్నో శుభ, అశుభ కార్యాల సమాచారం అందించాను. ఇప్పుడంటే సెల్‌ఫోన్లు వచ్చాయి. కానీ సుమారు పదిహేనేళ్ల కిందటివరకు మీరు ఎక్కడున్నా.. మీ క్షేమ సమాచారాన్ని మీ కుటుంబ సభ్యులకు అందించింది నేనే. ఎంతోమంది నిరుద్యోగులకు సమాచారం ఇచ్చి ఉద్యోగాలు పొందేందుకు దోహదపడింది నేనే. దేశ, విదేశాల్లో ఉన్న మీ వాళ్ల బాగోగుల సమాచారం ఇచ్చింది నేనే. నేను పంపే ఉత్తరం కోసం మీరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసే వారు. అలాంటి నేను ఇపుడు వృద్ధాప్య దశ (శిథిలావస్థ)కు చేరుకున్నాను. నన్ను బాగు చేయించడానికి నా వాళ్లు (అధికారులు) కనికరించడం లేదు. అందరూ ఉన్నా అనాథలా ఉండిపోతున్నాను. దయచేసి మీలో ఎవరైనా నా అవస్థను మా పుట్టింటికి (తపాలా శాఖకు) తెలియజేసి నన్ను బాగుచేయించాలని చేతులెత్తి నమస్కరిస్తున్నాను.

ప్రేమతో..
మీ పోస్ట్ బాక్స్

- హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి)



బాలసముద్రంలో శిథిలావస్థలో ఉన్న పోస్టు బాక్స్

అంబేద్కర్ జయంతి వేడుకలకు అధికారుల గైర్హాజరు

● షోకాజు నోటీసులు జారీ చేసిన అడిషనర్ కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో వివిధ విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న వింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం బల్దియాలో జరిగిన అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలకు గైర్హాజరు కావడంతో 37 మంది అధికారులపై చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల ముందే అంబేద్కర్ జయంతి వేడుకలకు అందరు తప్పకుండా హాజరు రావాలని కమిషనర్ కార్యాలయం నుంచి సర్క్యులర్ జారీ చేసినా కొందరు అధికారులు ఖాతరు చేయక పోవడంతో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. దీంతో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా విచారణ చేసిన అనంతరం 37 మంది ఉన్నతాధికారులు, సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేశారు. ప్రధానంగా ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, ఫైర్, సర్కిల్ కార్యాలయాల అధికారులు, రెవెన్యూ అధికారులకు నోటీసులు జారీ చేశారు. బల్దియా సీ-1 సెక్షన్ అధికారి రావుల ఆనంద్ గైర్హాజరైన అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేశారు.

శివనగర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఖిలావరంగల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతి సందర్భంగా 35 డివిజన్ శివనగర్‌లో అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం మంత్రి కొండా సురేఖ నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విగ్రహం చుట్టూ.. అంబేద్కర్ భవన్ వద్ద అభివృద్ధి పనులను చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు సోమిశెట్టి ప్రవీణ్, దిడ్డి కుమారస్వామి, విగ్రహ దాత రేణికుంట్ల రవీందర్, మేరుగు అశోక్, సంగి ఎలేందర్, గడ్డం రవి, బ్రహ్మచారి, శ్రీరామ రాజేష్, శామంతుల శ్రీనివాస్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

డీఆర్‌వో విజయలక్ష్మి ● కేఎంసీ ఆడిటోరియంలో అంబేద్కర్ జయంతి


జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న డీఆర్‌వో విజయలక్ష్మి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని వరంగల్ డీఆర్‌వో విజయలక్ష్మి అన్నారు. అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను సోమవారం కేఎంసీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. డీఆర్‌వో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదని, సంఘ సంస్కర్త, జ్ఞానదీప్తి కలిగిన మార్గదర్శి అని అన్నారు.

డీఆర్‌డీవో కౌసల్యాదేవి మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను అందించారని అన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. కులాంతర వివాహాల ప్రోత్సాహకం కింద నాలుగు జంటలకు ప్రభుత్వం తరుపున ఒక్కొక్కరికి రూ.2 లక్షల 50 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశామన్నారు.

వేడుకల్లో జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఐద్వా నాయకురాలు రత్నమాల, వివిధ కుల సంఘాల నాయకులు అరూరి కుమార్, బిర్రు మహేందర్, మన్నె బాబురావు, తరాల సందీప్, టి.ఎల్లయ్య, నమిండ్ల చిన్నస్వామి, కె.మోహన్, బొమ్మల అంబేద్కర్, గడ్డం శోభారాణి, రాజేందర్, శంకర్, ప్రశాంత్, నరేశ్, గోపాల్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పితామహుడు అంబేద్కర్

మామునూరు పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ


పీటీసీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పూజ

మామునూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు స్ఫూర్తిగా నిలిచిన భారత రాజ్యాంగ పితామహుడు బీఆర్.అంబేద్కర్ అని మామునూరు పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం పీటీసీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంబేద్కర్ తరతరాలకు గుర్తుండిపోయేలా దేశానికి సేవలందించారని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెడితే మానవుడే మహనీయుడవుతాడని అన్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గోవిందరాజుల రథోత్సవం


రథోత్సవం ప్రారంభించిన కార్పొరేటర్ అనిల్ కుమార్

గిర్మాజీపేట,ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని పురవీధుల్లో సోమవారం శ్రీగోవింద రాజస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం 10 గంటలకు గుట్ట వద్ద రథోత్సవాన్ని కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, ఈవో మిట్టపల్లి భాస్కర్, రథసారథి చింతాకుల సునీల్ కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. అర్చకులు జగన్నాథం, వేణు, కిరణ్ స్వామి, వేణుమాధవ్ స్వామి, అనిల్ స్వామి, మధు స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్న రథం ముందుకు సాగుతుండగా వెనుకనే శ్రీగోవిందరాజస్వామి పెద్ద రథం బయలుదేరింది. ఈ రథోత్సవం రజకుల వాడ, రాధిక టాకీస్, జీపీఎస్ రోడ్డు మీదుగా రాత్రి శ్రీ దుర్గేశ్వరాలయం వరకు చేరుకుంది. మంగళవారం ఉదయం అక్కడి నుంచి బయలుదేరి పిన్నావారి వీధి, ఎల్లమ్మబజార్, జీసీఎన్ రోడ్డు మీదుగా సత్యా ఆస్పత్రి వరకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో రథానికి స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో శ్రీలలితా యాగం

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని కీర్తిస్తూ మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లోని అమ్మవారి దేవాలయంలో ఈ నెల 11 నుంచి గత కొనసాగుతున్న శ్రీలలితా యాగం చివరి హోమం పూర్ణాహుతి సోమవారం మహా వైభవంగా నిర్వహించారు. అమ్మవారి భక్తులు పలువు పుర ప్రముఖులు ఆలయానికి తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వొద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, ప్రధానార్చకులు లక్ష్మణ్‌శర్మ, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

● నగరంలో వాడవాడలా వేడుకలు
● దుస్తులు, పండ్లు పంపిణీ చేసిన పలు సంఘాలు

గిర్మాజీపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను వరంగల్ కాశిబుగ్గ జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బస్వరాజు శిరీష శ్రీమాన్, కాంగ్రెస్ నాయకులు టి.లక్ష్మణ్, గోరంటల రాజు, వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేశ్వర్‌లు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, నాయకులు అజ్మీరాసీతారాం నాయక్, ఆరూరి రమేష్, మార్టిన్ లూథర్, కుసుమ సతీష్ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పోచమ్మ మైదాన్ నుంచి కాశిబుగ్గ అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర చేశారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఆ పార్టీ నాయకులు బి.స్వామి, పుల్ల రమేష్, బానోతు కిరణ్ నాయక్, కిషోర్, మధుకర్, వంశీకృష్ణ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సి.హెచ్.రంగయ్య, నాయకులు దుర్గయ్య, ప్రశాంత్, కుమార్, వివిధ ప్రజాసంఘాల నాయకులు నివాళి అర్పించారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు, నాయకులు రమేష్, మల్లారెడ్డి, రాజేష్, హఫీజ్‌లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్ కిషన్‌తో పాటు వివిధ ఉద్యోగ, దళిత సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

● శంభునిపేట: శంభునిపేట నాగమయ్య జంక్షన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్నె రవీందర్, అర్జున్, వాసుదేవ్, పరశు రాములు, జనార్దన్, సుదర్శన్, శ్రీనివాస్, భిక్షపతి, సాగర్, భరత్, రాజు పాల్గొన్నారు.

41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి డివిజన్‌లోని పలు కాలనీలతో పాటు కార్పొరేషన్‌లో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులు అర్పించారు. రంగశాయిపేట హరిజనవాడలో గల అంగన్‌వాడీ సెంటర్‌లో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మచ్చ సుధాకర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. అనసూయ, మచ్చ కవిత, రాజబాబు, సింగారపు బాబురావు, ప్రమోద్, రాజేందర్, విజయ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మమత, కోఆర్డినేటర్ మాణిక్య రేఖ, ఎస్ఎస్ఎస్ కమిటీ సభ్యులు షమీ మున్నీసా పాల్గొన్నారు.

40వ డివిజన్ ఉర్సు ఎస్సీ కాలనీలో పసునూరి రమేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. వేడుకలలో లింగాల హరిశంకర్, పసునూరి శివ, వరప్రసాద్, మేకల యాదరాజు, దవుడు రాజ్‌కుమార్, మాదాసి రజిత, రార్తీక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్: మూడో డివిజన్ పైడిపెల్లిలో కార్పొరేటర్ జన్ను షిభారాణి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కాంగ్రెస్ నాయకుడు జన్ను అనిల్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఇట్యాల హరికృష్ణ, స్థానిక నేతలు కూనమళ్ల సారంగపాణి, బోనాల సల్మాన్, బోయిని ఐలయ్య, జన్ను సుధాకర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వడ్డెమానుకోట తిరుపతి, జన్ను ఆరోగ్యం, జన్ను రవి, జన్ను కుమార్, లింగం కోటిలింగం, ఆకుల రంజిత్, జన్ను కొమురయ్య, దుబ్బాక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

13వ డివిజన్ సీకేఎం జంక్షన్‌లో అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సురేష్‌జోషి ముఖ్య అతిథిగా హజరై అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జన్ను అనిల్‌కుమార్, కొత్తూరి యాకేందర్ , జన్ను పూర్ణ ప్రసన్న, జన్ను విజయ్‌కుమార్, వేణు, జన్ను స్వామి తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ టౌన్: వరంగల్ కొత్తవాడలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామెర రాజ్‌కమల్ అధ్యక్షతన అంబేద్కర్ జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు హజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు గొండ రజిత-శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దామెర సర్వేశ్, కొక్కుల సతీష్, డాక్టర్ పొన్నాల రాజేందర్, దామోదర్, గొండ శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కంటి ఆసుపత్రిలో 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి-సత్యనారాయణ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ కార్యదర్శి బాషకర్ల హరికృష్ణ, ఎల్.మొగిళి, ఎం.డి.అక్బర్, రాళ్లబండి ఉమ, గవాస్కర్ పాల్గొన్నారు.


పైడిపల్లిలో నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ జన్ను షిభారాణి తదితరులు


కొత్తవాడలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కాశిబుగ్గలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


శంభునిపేటలో నివాళి అర్పిస్తున్న స్థానికులు


అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ


కాశిబుగ్గ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ తదితరులు


అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ


కంటి ఆస్పత్రిలో అంబేద్కర్ విగ్రహనికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి

హాల్‌మార్క్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

● వినియోగదారుల సమన్వయ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబరాజు చక్రపాణి

మట్టెవాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల్ని మోసం చేస్తున్న హాల్‌మార్క్ సెంటర్లపై బీఐఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారుల సమన్వయ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి డిమాండ్ చేశారు. వరంగల్‌లో సోమవారం దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. బంగారు ఆభరణాల నాణ్యతకు కొలమానం అయిన హాల్ మార్కింగ్ విధానం సరిగా లేదని అన్నారు. ఆరు నెలలుగా వరంగల్, హనుమకొండ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లలో హాల్ మార్కిం గ్ సెంటర్లపై లైసెన్స్‌ల తాత్కాలిక రద్దు వల్ల వినియోగదారులు మోసపోయా రని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా లో నాలుగు, హైదరా బాద్‌లో 18 హాల్ మార్కింగ్ సెంటర్లను తాత్కాలికంగా రద్దు చేశారని తెలి పారు. బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ నిబంధనల ప్రకా రం అధికారులు, వినియోగదారుల సంఘాలతో మాత్రమే మార్కెట్‌లో టెస్ట్ చెక్ నిర్వహించినట్లయితే వినియోగదారులకు న్యాయం జరుగుతుంద న్నారు. ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులను ఆయా జిల్లాల వినియోగ దారుల కోర్టులలో నమోదు చేసినట్లు తెలిపారు. వినియోగదారుల సమితి దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మొగిలిచర్ల సుదర్శన్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సీనియర్ అడ్వకేట్ రాయబారపు భిక్షపతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్‌కుమార్, మిగతా అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇండ్లు కేటాయించే వరకు పోరాడుతాం

● వరంగల్ తూర్పు జర్నలిస్టులు ● రిలే దీక్షలు ప్రారంభం

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 14, (ఆంధ్రజ్యోతి): యూనియన్లకు అతీతంగా తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించే వరకు పోరాడుతామని వరంగల్ తూర్పు జర్నలిస్టులు శపథం చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు కేటాయించాలని కోరుతూ సోమవారం దేశాయిపేటలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూనియన్లకు అతీతంగా తాము దీక్ష చేస్తున్నామని, పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులతో పాటు ఎవరు కలిసివచ్చినా స్వాగతిస్తామని అన్నారు. డబుల్ ఇండ్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. తమ దీక్షలకు రాజకీయ రంగు అంటిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

● మద్దతు తెలిపిన నాయకులు..

వరంగల్ తూర్పు జర్నలిస్టులు చేపట్టిన రిలే దీక్షలకు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మద్దతు తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మట్టెవాడ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం మట్టెవాడ ఫైర్ స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండా సుధారాణి, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారి కేవీ సతీశ్, ఎస్ఎఫ్‌వో రాజేశ్వర్, ఫైర్ సిబ్బంది మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అగ్నిమాపక వారోత్సవాలు ఇలా...

వరంగల్‌లో సోమవారం ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతాయని డీఎఫ్‌వో కేవీ సతీశ్ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజున విధి నిర్వహణలో అసువులు బాసిన అగ్నిమాపక దళ సిబ్బందికి నివాళులర్పించారు. 15న జిల్లాలోని పబ్లిక్ స్థలాలు బస్టాండ్, రైల్వే స్టేషన్లు, పార్కులు, మార్కెట్లు, మాల్స్, సినిమా థియేటర్లు తదితర ప్రాంతాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారు. 16న ఆస్పత్రుల యాజమాన్యాలు, 17న అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో, 18న పెట్రోల్ బంకులు, ఎల్‌పీజీ స్టోరేజ్ గోదాములు, పారిశ్రామిక వాడల్లో, 19న ఫంక్షన్ హాల్స్, మల్టీప్లెక్స్ థియేటర్లు, విద్యాసంస్థల భవనాల్లో అగ్ని నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తారు. 20న వర్క్‌షాప్‌లు, సెమినార్లు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

'రయ్యాల'కు ఉత్తమ అవార్డు


బండా ప్రకాష్ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీధరాచార్యులు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ వ్యాఖ్యాత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గాయకుడు రయ్యాల శ్రీధరాచార్యులు ఉత్తమ వ్యాఖ్యాత అవార్డు అందుకున్నారు. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ సంస్థ, నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈ అవార్డులు అందించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ చేతుల మీదుగా రయ్యాల శ్రీధరాచార్యులు ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ఉభయ తెలుగు రాష్ట్రాలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో సేవలందిస్తున్న వారిని సత్కరించారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు సన్మానం

ఖిలావరంగల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ కిక్ బాక్సింగ్ పోటీల్లో రాణించిన క్రీడాకారులను కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్ సత్కరించారు. సోమవారం శివనగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో వరంగల్‌కు చెందిన క్రీడాకారులు కారంపూడి ఆర్యన్, రిషికేష్, బి.హాసిని, వికాస్ యాదవ్, వి. పూజ, నిహారిక, భవాని, హరికృష్ణ, యశ్వంత్, సాయి సిద్ధార్థ, గణేష్, అమూల్య, ఆద్య, గీతిక సాయి, అక్షయ, తృస్టిసోని.. వ్యక్తిగత, గ్రూపు పోటీల్లో పతకాలు సాధించారని అన్నారు. అదేవిధంగా సెక్రెటరీ, కోచ్‌లు ఇమ్మడి సంజీవ్ కుమార్, కళ్ళెపు సతీష్ చంద్ర, లోహిత్ రెడ్డిని సత్కరించారు.

'మా స్థలాన్ని కాపాడండి'

వరంగల్ సిటీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కబ్జాదారుడి నుంచి తన ప్లాటును కాపాడాలని కోరుతూ ఓ వ్యక్తి సోమవారం ఏనుమాముల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్.నగర్‌కు చెందిన బాధితుడు కుదురుపాక వెంకటేశ్ మాట్లాడుతూ.. కొన్నేళ్ల క్రితం తాను ఏనుమాముల మార్కెట్ మొగిలిచర్ల రోడ్ హెచ్‌పి పెట్రోల్ పంపు ఎదరుగా 48వ నంబర్ ప్లాటు కొనుగోలు చేశానని, ఆ స్థలంలో ఇటీవల బోరుతో పాటు రేకుల షెడ్డు వేశానని అన్నారు. అయితే బాజిరెడ్డి అనే వ్యక్తి సోమవారం బోర్ పీకేసి, రేకుల షెడ్డును జేసీబీతో తొలగించాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరానని అన్నారు.


కాశిబుగ్గలో మజ్జిగ పంపిణీ

వరంగల్ సిటీ, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలో లక్ష్మి గణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం వేముల కనుకయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వంగరి రాంప్రసాద్, దుస్స కృష్ణ, దాసి కృష్ణ, చంద్రశేఖర్, వంగరి రవి, ములుక సురేష్, శ్రీకాంత్, క్యాతం శ్రీనివాస్, బండారి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

గురువులు సదాస్మరణీయులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భద్రకాళి శేషు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి గురువులు సదా స్మరణీయులని, ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేమని భద్రకాళి ఆలయ పూజారి భద్రకాళి శేషగిరి రావు అన్నారు. 1973-74లో ఆర్య బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం వరంగల్ కెమిస్ట్రీ భవన్‌లో సర్ణోత్సవ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు గురువులు నేర్పిన సంస్కారమే తనను ఉన్నతుడిగా తీర్చి దిద్దిందని అన్నారు. నాటి ప్రిన్సిపాల్ స్వర్గీయ గుజ్జారి రామన్న సార్ తమకు మార్గదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేయూ మాజీ రిజిస్ట్రార్ మామిడాల సుధాకర్‌తో పాటు దాదాపు 36 మంది పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు వెంకన్న, పాపిరెడ్డి, ప్రభాకర్‌రావు, దుర్గాప్రసాద్, సుశీల, తారాబాయి, శివానందం, శ్యాంసుందర్, నరేందర్‌తో పాటు పాలక మండలి చైర్మన్ గుజ్జారి రమేష్‌ను ఘనంగా సత్కరించారు.



రాజ్యాంగ ప్రదాతకు జేజేలు

- వరంగల్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి
- కాశిబుగ్గలో నివాళులర్పించిన మంత్రి కొండా సురేఖ

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు వరంగల్ జిల్లాలో ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, అధికారులు, వివిధ వర్గాలు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. వరంగల్ లోని కాశిబుగ్గ సెంటర్‌లో వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- గిర్మాజీపేట

6



కాశిబుగ్గ సెంటర్‌లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

పుణ్యక్షేత్రానికి వెళ్లొస్తూ..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృత్యువాత

- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- హైవేపై లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారు
- హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ వాసులు
- కాళేశ్వరం దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్ వద్ద ఘటన

7



కారులో ఇరుక్కున్న శ్రీను మృతదేహం



రమణకుమారి మృతదేహం



అనూష మృతదేహం

వేధింపులతో వృద్ధుడి బలవన్మరణం

ఆస్తి కోసం కొడుకు, కోడలు ఒత్తిడితో ఆత్మహత్య

- వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెంలో ఘటన
- కేసు నమోదు చేసిన వర్ధన్నపేట పోలీసులు

6



ఎంఆర్‌డీలో ప్రతీ పనికో రేటు

సర్టిఫికెట్ల జారీలో ఓ జూనియర్ అసిస్టెంట్ చేతివాటం

6

ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా..

అంగన్వాడీ కేంద్రాల్లో 'పోషణ పక్షం'

- హనుమకొండ జిల్లాలో ఈనెల 8న ప్రారంభం
- 'విద్య, ఆరోగ్యం' లక్ష్యంగా కార్యక్రమాలు
- వేయి దినాల ప్రాముఖ్యతపై అవగాహన
- గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు ఉపయుక్తం
- 15 రోజుల పాటు నిర్వహణ.. ఏప్రిల్ 22న ముగింపు..



ఇటీవలే పెగడపల్లిలో జరిగిన పోషణ పక్షం కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి, సిబ్బందితో పాటు అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు





హనుమకొండ సిటీ, ఏప్రిల్ 14: గర్భిణులు, బాలింతలు, 0-6 ఏళ్ల చిన్నారుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా చేపట్టిన 'పోషణ పక్షం-2025' కార్యక్రమం హనుమకొండ జిల్లాలో కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'పోషణ్ పక్షం' జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ నెల 8న ఆరంభమైంది. 15రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ఏప్రిల్ 22న ముగుస్తుంది. మహిళా, శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో ఇతర ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో 'పోషణ పక్షం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

లక్ష్యాలు

మహిళా, శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమం, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల భాగస్వామ్యంతో కార్యక్రమం కొనసాగుతోంది. పోషణ్ బీ-పడాయి బీ (పౌష్టికాహారం-విద్య) సూత్రంతో పోషణ పక్షం-2025 చేపట్టారు. జిల్లాలోని 778 అంగన్వాడీ కేంద్రాల్లో 15 రోజుల పాటు నిర్వహిస్తారు. అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన బాలింతలు, గర్భిణులు, ప్రీస్కూల్ పిల్లలకు బలమైన పౌష్టికాహారం తీసుకోవాల్సిన విధానాలను దృశ్యరూపకంగా, మౌఖిక వివరణ వివిధ మార్గాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ర్యాలీల నిర్వహణ, గ్రామీణ, మండల, నియోజకవర్గకేంద్రాల్లో పాటు జిల్లా కేంద్రంగా వివిధ రూపాల్లో అవగాహన సభలు, సమావేశాల నిర్వహణ ప్రణాళికగా పోషణ్ పక్షం కొనసాగుతోంది. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు, చికిత్సలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, చిన్నారులకు బలవర్ధక ఆహారం అందించడం, అంగన్వాడీ కేంద్రాల్లో అందచేస్తున్న తీరు తదితర అంశాలను వివరిస్తున్నారు.

వేయి దినాల ప్రణాళిక విశిష్టత

తల్లితో పాటు శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేందుకు 'వేయి దినాల' ప్రణాళిక ప్రాముఖ్యత విశిష్టతను అంగన్వాడీ కేంద్రాల్లో తెలియచేస్తున్నారు. గర్భాదారణ నుంచి ప్రసవం దాక గర్భిణీకి తొమ్మిది నెలల సమయం పడుతుంది. ఈ కాలాన్ని 270 రోజులుగా లెక్క కడతారు. ఈ సమయంలో గర్భిణీ తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టికాహారం అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో వివరిస్తూ ఆ మేరకు వారికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఇక ప్రసవం తరువాత తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్య పరిరక్షణ చర్యలను పోషణ పక్షం కార్యక్రమంలో వివరిస్తున్నారు. శిశువు జననం నుంచి ముర్రుపాలు పట్టించడం, ఆపై రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాల శ్రేష్ఠత, ఆరోగ్యం అంశాలను తల్లితో పాటు భర్త ఇతర కుటుంబ సభ్యులకు సైతం అవగాహన కల్పించే చర్యలను చేపడుతున్నారు. శిశువు రెండేళ్ల వయస్సుకాలాన్ని మొత్తం 730 రోజులుగా లెక్క కడుతున్నారు. ఈ క్రమంలో గర్భిణీ నుంచి ప్రసవం వరకు తల్లి ఆరోగ్యం కోసం 270 రోజులు, శిశువు రెండేళ్ల వయస్సు లెక్కన 730 రోజులు ఈ రెండింటినీ కలిపితే వేయి రోజుల ప్రణాళికతో తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణ కాలంగా పరిగణించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. వేయి దినాల ప్రత్యేకతను అంగన్వాడీ కేంద్రాల్లోనే కాక ఆయా గ్రామాలు, మండలాల ప్రధాన కేంద్రాల్లో దృశ్య శ్రవణ మార్గాలు, పోస్టర్లు, కరపత్రాలు, ఇంటింటి సందర్శన తదితర మార్గాల ద్వారా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఇతర శాఖల అధికారులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు అవగాహన కల్పిస్తున్నారు.

విద్యకు ప్రాముఖ్యత

'పోషణ్ బీ - పడాయి బీ' (ఆరోగ్యంతో పాటు విద్య కూడా...) సూత్రంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ దశలో శిశువులకు విద్యపై ఆసక్తి కల్పించే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యత వివరింపు తద్వారా పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించడం వంటి చర్యలపై దృష్టి పెట్టారు. ఈ మేరకు పక్షత్వాల్లో అవగాహన కల్పన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యపై ఆసక్తి కల్పించేందుకు వినూత్న పద్ధతుల్లో చేపడుతున్న బోధన మార్గాలను తెలియచేస్తున్నారు. ఆట వస్తువులు, బొమ్మలు ఇతరత్రా మార్గాల ద్వారా వారికి విద్యపై ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. చిరు ప్రాయంలోనే పిల్లలకు విద్యపై ఆసక్తి కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైనా పునాదులు వేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

23తో ముగింపు

ఈ నెల 8న పోషణ పక్షం - 2025 కార్యక్రమాన్ని ఆరంభించారు. 22న ముగుస్తుంది. హనుమకొండ జిల్లా కేంద్రంగా త్వరలో భారీ కార్యక్రమ నిర్వహణకు మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలు చేపడుతోంది. ఇటీవలే అంగన్వాడీ కేంద్రాల్లోని 0-6 ఏళ్ల చిన్నారులకు నేత్ర పరీక్షలను ప్రభుత్వం చేపట్టింది. రెండు నెలల పాటు జిల్లాలోని 778 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రణాళిక మేరకు ఆయా రోజుల్లో పరీక్షలను నిర్వహించి దృష్టి లోపాలను గుర్తిస్తున్నారు. ఒకవైపు నేత్ర పరీక్షలు మరో వైపు పోషణ పక్షం కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఇతర సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు తదితరులు తలమునకలయ్యారు.

నిరుద్యోగులకు 'రాజీవ్' మంచి అవకాశం

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



కాశిబుగ్గ సర్కిల్ ఆఫీసులో దరఖాస్తులు పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు రాజీవ్ యువ వికాసం పథకం మంచి అవకాశం అని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారంతో ముగుస్తుండడంతో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. సెలవు రోజు అయినా హెల్ప్‌డెస్క్‌లలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 12, 13, 14 తేదీలలో ప్రభుత్వ సెలవులు ఉన్నా కూడా ప్రజల సౌకర్యార్థం బల్దియా, కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాలలో దరఖాస్తులు స్వీరించామన్నారు. సోమవారం సాయంత్రం వరకు 10,254 దరఖాస్తులు స్వీరించినట్టు కమిషనర్ వెల్లడించారు. కమిషనర్ వెంట బల్దియా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కృషి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో 'భాగంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా సోమవారం 52, 53, 44 డివిజన్‌లలో తలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కేయూ క్రాస్ నుంచి పెట్రోల్ పంపు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు రాజ్యాంగం పట్ల ఏ విధంగా వ్యవరిస్తున్నాయో ప్రజలకు ఈ యాత్ర ద్వారా తెలియజేస్తున్నామన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అమిత్ షా అవమానపరిచాడన్నారు.



కేయూ నుంచి పెట్రోల్ పంపు వరకు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం, కావ్య తదితరులు

రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ.. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలనను సాగిస్తోందన్నారు. పేద ప్రజలకంటే బడాబాబులే ముఖ్యమన్నట్లుగా ప్రధాని మోదీ దేశాన్ని పాలిస్తున్నారని ఆరోపించారు. అనంతరం డివిజన్‌లలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ తీశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీ కడియం కావ్య, ఎంఎల్‌సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రు పాషా, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఏఐసీసీ నాయకుడు బెలయ్యనాయక్, 54 డివిజన్ కార్పొరేటర్ గుంటి రజితా శ్రీనివాస్, నాయకులు బంక సంపత్, నాయి ని లక్ష్మారెడ్డి, మట్టెడ అనిల్, రహీమున్నీసా బేగం ఎర్ర మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

నర్సంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రజాదండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి జిల్లాకలెక్టర్‌కు విజ్ఞప్తిచేశారు.పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎంఎస్పీ, డీబీడీపీఎస్ ఆధ్వర్యంలో గుడిసెవాసులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 21వ రోజుకు చేరుకున్నాయి. ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్ కుమార్, డీబీడీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జలగం రమేష్‌తో కలిసి దీక్షను ప్రారంభించి మాట్లాడారు. అంబేద్కర్ నగర్ కాలనీ వాసులకు ఇంటి నంబర్లు ఇవ్వడంతో పాటు కరెంట్, తాగునీరు. రోడ్లు తదితర మౌలిక సౌకర్యాలుకల్పించాలని కోరారు. కార్యక్రమంలో మునిగె యాకోబు. సుధాకర్, రవి, బాలు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

గీసుగొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంద నాయక్ తండా గ్రామానికి చెందిన బాదావత్ రవి అనే వ్యక్తి ఇంటి పక్కన ఉన్న రేణుక ఇంట్లోకి ఆమె భర్త లేని సమయంలో వెళ్లి చేయిపట్టుకుని అఘాయిత్యానికి పాల్పడగా, ఆమె గట్టిగా అరువగా రవి పారిపోయాడు. ఈ విషయమై బాధితురాలు రేణుక గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రవిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. కాగా, రేణుక భర్త నర్సింహ అతని కుటుంబ సభ్యులతో కలిసి బాదావత్ రవి ఇంటిలోకి వెళ్లి సామగ్రిని కర్రతో ధ్వంసం చేసినట్లు రవి భార్య మానస పోలీసులకు ఫిర్యాదు చేయగా నర్సింహపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా
పంటలు సాగుచేసుకోవాలి

పొట్టబత్తిని హరిప్రసాద్‌బాబు, మండల వ్యవసాయాధికారి

ఫటా ఫట్



ఆంధ్రజ్యోతి : భూసార పరీక్షలకు మట్టిని ఎలా సేకరించాలి?

ఎంఏవో : సాగుభూమిలోని నలు దిక్కులా నీడప్రదేశం లేని చోట నేలను వి ఆకారంలో తవ్వి పొడిగా మార్చి పాలిథిన్ సంచిలో నింపి భూసార పరీక్షకు పంపించాలి.

ఆంధ్రజ్యోతి : ఎక్కడ భూసార పరీక్షలు చేస్తారు?

ఎంఏవో : ములుగురోడ్డులోని వ్యవసాయపరిశోధన కేంద్రంలో భూ సార పరీక్షలు చేస్తారు. రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)కు మట్టి సాంపిల్స్‌ను అందిస్తే 20 రోజుల్లో భూసార పరీక్ష ఫలితాలను చెబుతారు. దానికి అనుగుణంగా పంటలు సాగుచేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : మండలంలో సాగుకు యోగ్యమైన భూమి ఎంత ఉంది?

ఎంఏవో : మండలంలో సాగుకు యోగ్యమైన భూమి 22 వేల ఎకరాలు ఉంటుంది. ప్రస్తుతం 17,274 ఎకరాల్లో రైతులు పంటల సాగు చేస్తున్నారు. ఎక్కువగా నల్లరేగడి, చౌక నేలలు ఉన్నాయి

ఆంధ్రజ్యోతి : వేసవిలో దుక్కి ఎలా చేసుకోవాలి?

ఎంఏవో :ఎక్కువలోతు వరకు దుక్కి అయ్యే విధంగా చూసుకోవాలి. దీనివల్ల సూర్యరశ్మి భూమిలోపలికి వెళ్లి తెగుళ్లకు సంబంధించి కోశస్థదశ లార్వాలు, కలుపుగడ్డి గడ్డలు చనిపోతాయి. నత్రజని స్థిరీకరణ కూడా జరిగి పంటల పెరుగుదలకు ఉపయోగపడుతుంది.

ఆంధ్రజ్యోతి : మండలంలో సాగవుతున్న ప్రధాన పంటలు ఏవి?

ఎంఏవో : ప్రధాన పంటల సాగు పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలు. కాగా, ఇటీవల ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టిపెడుతున్నారు.

ఆంధ్రజ్యోతి : సబ్సిడీ ద్వారా రైతులకు ఏమి ఇస్తున్నారు?

ఎంఏవో : మహిళా రైతులకు పవర్‌టిల్లర్, పవర్‌స్ప్రేయర్, హాండ్ స్ప్రేయర్, కల్టివేటర్, డిస్క్‌హారో, రోటోవేటర్ లాంటి వ్యవసాయ పనిముట్లు 40 శాతం సబ్సిడీతో అందిస్తున్నాం.

- గీసుగొండ (ఆంధ్రజ్యోతి)

పునీతా రాయప్ప చర్చి మాజీ ఫాదర్ మృతి

చెన్నారావుపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామ పునీతా రాయప్ప చర్చి మాజీ ఫాదర్ అంబటి బాలారెడ్డి(80) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందారు. గ్రామంలో బాలయేసు మందిర నిర్మాణం, వాటర్ ట్యాంకు నిర్మాణం, 500 ఎకరాలకు సాగునీటి సదుపాయాన్ని అందించడానికి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని నిర్మాణం చేశారు. కాగా, సోమవారం గ్రామస్థులు ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి, మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.ఆయన చేసిన సేవలు మరవలేమని గ్రామస్థులు పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో చర్చి ఫాదర్ వై.యాగారెడ్డి, గుడి పెద్దలు, ప్రదీప్‌కుమార్, ఇన్నయ్య, రాజు, భాస్కర్, బాలస్వామి, దేవదానయ్య, వై.జయరాజు, జోసఫ్‌తంబీ, రెడ్డి మాస్ కిషోర్ ఉన్నారు.

వ్యవసాయ బావిలోపడి రైతు మృతి



పెద్దరాజయ్య(ఫైల్)

నెక్కొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు రాళ్లబండి పెద్దరాజయ్య (56) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. వ్యవసాయ పనుల నిమిత్తం ఈ నెల 13 సాయంత్రం పెద్దరాజయ్య తన భూముల వద్దకు వెళుతున్న క్రమంలో కొత్తపల్లి వీరారావుకు చెందిన వ్యవసాయ బావిలో కాలుజారీ పడ్డాడు. సాయంత్రం కావడంతో ఎవరూ గమనించలేదు. కుటుంబ సభ్యులు అదేరోజు రాత్రి వరకూ పెద్దరాజయ్య కోసం వెతికినా జాడ తెలియక పోవడంతో 14న ఉదయం కూడా అతడి కోసం వెతికారు. చివరకు సాయంత్రం నాలుగు గంటల సమయంలో పెద్దరాజయ్య బావిలో శవమై తెలిన విషయాన్ని గ్రామస్థులు గుర్తించారు. మృతుడి కుమారుడు శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని శవపంచనామ జరిపి శవాన్ని పోస్టుమార్టంకు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య స్వరాజ్యం, మరో కుమారుడు రంజిత్ ఉన్నారు.

అగ్నిమాపక వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వర్ధన్నపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలో సోమవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి చొల్లేటి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రమాదాలను అరికడదాం జాతీయ సంపదను పెంపొందిస్తాం అని పిలుపు నిచ్చారు. అగ్నిప్రమాదాల నివారణకు కృషి చేస్తుందన్నారు. సాధారణ రోజుల కన్నా వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువ సంభవిస్తుంటాయని, అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం కర్తవ్య నిర్వహణలో అసువులు బాసిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులు అర్పించారు.

అక్రమ నిర్మాణం పాక్షికంగా తొలగింపు

పర్వతగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నారంలో ఓ వ్యక్తి రెవెన్యూ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టగా విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు దానిని సోమవారం పాక్షికంగా తొలగించారు. అనంతరం ఎంపీవో శ్రీనివాసులు మాట్లాడుతూ రెవెన్యూ భూమి సర్వే నంబర్ 489లో అక్రమ నిర్మాణం చెపట్టినట్లు సమాచారం అందడంతో వెంటనే గ్రామ సిబ్బందితో కలిసి తొలగించి, సదరు వ్యక్తికి నోటీసులు ఇచ్చామన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

సంగెం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు మృతుల కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించిపార్టీ పరంగా ఆదుకుంటామని తెలిపారు. మండలంలోని మొండ్రాయి గ్రామ మాజీ సర్పంచ్ పెండ్లి కొమురమ్మ,వీఆర్ఎన్ తండాలో వాసరి అరుణ్‌కుమార్, గుగులోతు సురేష్, కుంటపెల్లి గ్రామానికి చెందిన చిర్ర బన్ని కుటుంబాలను ఆయన బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట మాజీ జడ్‌పీటీసీ సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి, సంగెం సొసైటీ చైర్మన్ కుమారస్వామి యాదవ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్ర్యాలలో మునిగాల సమ్మయ్య గుండెపోటుతో మరణించగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. మృతుడికి కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు అక్బర్, సతీష్, గజ్జెల సదయ్య, గుజ్జ రవీందర్‌రెడ్డి, రవి ఉన్నారు.

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నర్సంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతిమాధవ రెడ్డి



వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు



రాయపర్తిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నర్సంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ దూరదృష్టితో రాజ్యాంగం రాశారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, సీసీసీ సభ్యుడు రామానంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేందర్, వీరప్రకాశ్, మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్, మహిళా నాయకులు రజనీభారతి, రమాదేవి, తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు జావిద్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయదీప్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు పంజాల రమేశ్ ఆ పార్టీ మండల కార్యదర్శి గడ్డం యాకయ్య, మియాపురం గోవర్ధన్, గడ్డం నాగరాజు, పిట్టల సతీష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత, పద్మ, దివ్య, స్వప్నలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మాక రవి యూఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. రామాలయం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ నల్లభారతి మహిళలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు గూడూరు సందీప్, నర్సింహ రాములు, శ్రీనివాస్, రాంచంద్రారెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి పూల మాలవేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఈసంపల్లి బాబు, కుమారస్వామి, శ్రీధర్, రాజులు పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఉద్యోగులతో కలిసి మునిసిపల్ కమిషనర్ జోనా పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం 5 శాతం ఇంటి పన్నుపై రాయితీ వసూళ్ళ గురించి రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులతో కలిసి డిపో మేనేజర్ అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి ఉద్యోగులకు పంపిణీ చేశారు.

● వర్ధన్నపేట (ఆంధ్రజ్యోతి) : లౌకిక వ్యవస్థాపకుడు ఆత్మగౌరవ అస్తిత్వ ఉద్యమాలకు దశదిశాలు చూపిన స్ఫూర్తిదాత అంబేద్కర్ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం అంబేద్కర్ 134 జయంతిని పురస్కరించుకొని వర్ధన్నపేట పట్టణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలుత కొత్త బస్టాండ్ వివేకనంద విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జై భీమ్ అని నినాదాలు చేస్తు దళిత సంఘాల, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అలాగే మహానీయుల జయంతి ఉత్సవాల కమిటీ కన్వీనర్ శ్రీకాంత్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, మాస్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో మహానీయుల స్ఫూర్తి యాత్ర అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మహేష్, భాస్కర్, చెన్నయ్య, భాస్కర్, మహేందర్, కరుణకర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ మండల అధ్యక్షురాలు కొండేటి అనితసత్యం ఆధ్వర్యంలో పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రాము, సత్యం, కుమారస్వామి, రాజ్‌కుమార్, రవికుమార్, యాకయ్య, సోమిరెడ్డి, సుభాష్, బాబు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ అంబేద్కరిజం జేఏసీ ఆధ్వర్యంలో కన్వీనర్ తుమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కుమారస్వామి, బాబు, ఆనందం, ముత్తయ్య, యాకయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. మండలంలోని ఇల్లందలో అంబేద్కర్ విగ్రహనికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీచేశారు. బండౌతపురంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మరుపట్ల వేణు కేక్ కట్‌చేసి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● రాయపర్తి (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందుగా రాయపర్తిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రాసి పేద ప్రజల బతుకుల్లో వెలుగులు నింపారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. మండలంలోని మైలారం, కొలన్‌పెల్లి, రాయపర్తిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సైతం అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని ఊకల్, మైలారంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వాడవాడనా రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే వివిధ గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు.

● నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : చిన్న రాష్ట్రాల ఏర్పాటుతోటే అన్ని రకాల అభివృద్ధి సాధ్యమవుతుందన్న అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు ఈదునూరి యాకోబ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా నెక్కొండలోని అంబేద్కర్ విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి ఘనంగా జయంతి ఉత్సవాలు జరిపారు. అనంతరం తాటిపల్లి శివకుమార్‌సురేఖ సహకారంతో అన్నదాన్నం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఈదునూరి యాకయ్య, చెన్నకేశవులు, అశోక్, వెంకటేశ్వర్లు, వెంకన్న, సూర్యారావు, ప్రభాకర్, ప్రశాంత్, భాను, వెంకటయ్య, సాయికృష్ణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● పర్వతగిరి (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, రాజకీయ, కుల, ప్రజా, విద్యార్థి తదితర సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాత్రి పర్వతగిరి అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున శోభ యాత్ర నిర్వహించారు. ఈ శోభాయాత్రలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

● ఖానాపురం (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, పార్టీ శ్రేణులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటప్రసాదరావు, ప్రసాదరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అచ్యుతమ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఉపేందర్, ముస్తాఫా, ముఖేష్, సాగర్‌రావు పాల్గొన్నారు.

అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, శ్రేణులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదగిరి, రాజు, వెంకన్న, నాగేశ్వరరావు, శ్రీను, కమలాకర్ పాల్గొన్నారు.

● చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని లింగగిరిలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో, అమీనాబాద్‌లో మాజీ సర్పంచ్ రమేష్, మండల కేంద్రంలో సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సయ్యగౌడ్, మండల కేంద్రంలోని యాదగిరి, కానిస్టేబుల్ రమేష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, మండల పరిషత్ కార్యాలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీవాణి చేపట్టారు. కార్యక్రమంలో అజయ్, రవి, పలువురు నాయకులు. అభిమానులు పాల్గొన్నారు.

● సంగెం (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చేసిన కృషి మరవలేనిదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకు యువత పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పీటీసీ సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి, సంగెం మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు బాబు, జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు సాగర్‌రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి, హక్కుల కోసం డాక్టర్ అంబేద్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, సంగెం ఎస్సై నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రసిడెంట్ రమేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి రమేష్, సమన్వయ కమిటీ సభ్యులు రాజు, కోటేశ్వర్, నాయకులు రాజేష్, రామకృష్ణ, నరేష్, వంశీకృష్ణ పాల్గొన్నారు. లోహిత గ్రామంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా చింతల అన్వేష్, కాకతీయ యూనివర్సిటీ డైరెక్టర్ ఎల్‌బి. రాజ్‌కుమార్, కేంద్రం సూపరింటెండెంట్ దేవీలాల్‌లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రమణ, సురేష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. గవిచర్లలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు, రాజకీయాలకతీతంగా పలువురు నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాబు, రమేష్, సదయ్య, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

●దుగ్గొండి (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మంపేట, పొనకల్, వెంకటాపురం, లక్ష్మీపురం గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాబు, వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ రవికుమార్, కిరణ్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, రవివర్మ, సాంబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● నల్లబెల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో పాటు దళిత సంఘాల నాయకులు పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి, పండ్లను ప్రజలకు పంపిణీచేశారు. అలాగే అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి రెడ్డి, రమేష్, అశోక్, శేఖర్, శివారెడ్డి, సారంగపాణి, మురళి, ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గుప్తా, సాంబయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలి

గీసుగొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 21న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు పరకాల నియోజవర్గం నుంచి వేలాదిగా తరలి రావాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గీసుగొండలోని వీడీఆర్ గార్డెన్స్‌లో సంగెం, గీసుగొండ మండలాలు, జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 15, 16, 17 డివిజన్ల బీఆర్ఎస్ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆ తరువాత రజతోత్సవ మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో మాజీజడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, సదానందం, వేణుగోపాల్‌రెడ్డి, ప్రకాశ్, నాగేశ్వర్‌రావు, రఘు, బాబురావు, శ్రీకాంత్, ప్రమోద్, సంగెం, గీసుగొండ మండలాల, జీడబ్ల్యూఎంసీ 15, 16, 17 డివిజన్ల మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, సొసైటీ, మార్కెట్ చైర్మన్‌లు, కమిటీ సభ్యులు, మండల, గ్రామ పార్టీ, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు మొదలు ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు రాజకీయాలకు అతీతంగా పరిపాలన అందించిన ఘనత కేసీఆర్‌దేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, నియోజకవర్గ నాయకులు కొమ్ము రమేష్ అన్నారు. ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజితోత్సవ సభను విజయవంతం చేయాలి కోరుతూ సభ వాల్ పోస్టర్‌లను సోమవారం వెంకటాపురం గ్రామంలో విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు జాటోతు రమేశ్, మారం రాము, రవీందర్‌రెడ్డి, వీరస్వామి, సారంగపాణి, వీరభద్రం, రాజు, యాదగిరి, లెనిన్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

● నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రాములునాయక్ తండాలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జీలు జయపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, రవి పాల్గొన్నారు.

● చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజితోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బాల్నె వెంకన్నగౌడ్ పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని అమీనాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పత్తినాయక్, మాజీ ఎంపీపీ అశోక్, సొసైటీ చైర్మన్ మురహరి రవి, మురళినాయక్ పాల్గొన్నారు.

● దుగ్గొండి (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజితోత్సవ సభను విజయవంతం చేయాల ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సకినే రాజేశ్వర్‌రావు అన్నారు. మండలం లోని గిర్నిబావిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, భద్రయ్య, రాంబాబు, రంగారావు, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, మొగిలి, రాజన్న, రమేశ్, ఐయిల్‌రెడ్డి, రజినీకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

● నల్లబెల్లి (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌పార్టీ తలపెట్టిన రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని బుచ్చిరెడ్డిపల్లి, లెంకాలపల్లి, రామతీర్థం, కొండాయిపల్లి గ్రామాల్లో నాయకులు పోస్టర్ ఆవిష్కరణచేశారు. కార్యక్రమంలో బానోతు సారంగపాణి, మురళి, ప్రవీణ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గుప్తా, సాంబరావు, తిరుపతి, అమరేందర్, వెంకన్న, చాంద్‌పాషా పాల్గొన్నారు.

వివాహం కావడంలేదని యువకుడి ఆత్మహత్య



వేణు(ఫైల్)

దుగ్గొండి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వివాహం కావడం లేదని జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకు న్న సంఘటన మండలంలోని వెంకటాపురంలో సోమవారం చోటు చేసుకుంది.ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం మండలంలోని వెంకటాపురానికి చెందిన ఇంగోలి రాజేశ్వర్‌రావుకు కుమార్తె, కుమారుడు వేణు(30) జన్మించారు. రాజేశ్వర్‌రావు వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతాడు, కుమార్తె వివాహం చేశాడు. కుమారుడు వేణు బిటెక్ చదివి హైదరబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగంచేశాడు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగంలో తక్కువ జీతం వస్తోందని నాలుగు రోజుల కిందట వేణు స్వగ్రామైన వెంకటాపురానికి వచ్చాడు. ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ మధ్య కాలంలో వేణుకు రెండు,మూడు పెళ్లి సంబంధాలు వచ్చి ఎత్తిపోయాయి. దీంతో వేణు మనస్తాపం చెంది బాధపడుతూ ఉండేవాడు. జీవితంపై విరక్తిచెంది తల్లిదండ్రులు ఉదయం వ్యవసా య పనులకు వెళ్లిన సమయంలో ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వేణు తండ్రి రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.